క్లుప్తంగా

ఎమ్మెల్యే సహకారంతో అభివృద్ధి



సీసీరోడ్డు పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ తదితరులు

తాండూరు రూరల్: ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి సహకారంతో గ్రామాభివృద్ధికి కృషి చేస్తున్నామని సర్పంచ్ రామమ్మ అన్నారు. సోమవారం తాండూరు మండలం చెన్‌గేస్‌పూర్‌లో ఎస్‌డీఎఫ్ నిధులు రూ.50 లక్షలతో సీసీరోడ్డు పనులు ప్రారంభించి మాట్లాడారు. కోనాపూర్, చెన్ గేస్‌పూర్ గ్రామంలో సీసీరోడ్లు, మురుగు కాల్వల నిర్మాణం చేపడతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల ప్రచార కార్యదర్శి ప్రవీణ్‌గౌడ్, హనుమాన్ దేవాలయ కమిటీ చైర్మన్ ప్రశాంత్‌గౌడ్, నాయకులు నరేష్ ముదిరాజ్, జై భీం నరేష్, బాల్‌రాజ్‌గౌడ్, భీంరెడ్డి, శాంతయ్య, ఎల్లప్ప, భాస్కర్ తదితరులు ఉన్నారు.

శ్రావణమాస సందడి



శ్రీ వీరభద్రేశ్వరస్వామికి క్షీరాభిషేకం చేస్తున్న భక్తులు

ధారూరు: శ్రావణమాసం మొదటి సోమవారం సందర్భంగా శ్రీ కపిలేశ్వరస్వామికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా శివలింగానికి జలం, పంచామృతంతో అభిషేకం చేశారు. క్షీరాభిషేకం, అనంతరం అలంకరించి నైవేద్యం సమర్పించి, హారతి ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. తొలుత ప్రథమ పూజ్యులు గణనాథునికి తర్వాత పార్వతీమాత, కుమారస్వామి, వీరభద్రేశ్వరస్వామి, నాగదేవత, నందీశ్వరస్వామి వార్లకు పూజలు చేశారు. ఆలయ పూజారి చెన్నబసవయ్యస్వామి భక్తులకు తీర్థ ప్రసాదం పంపిణీ చేశారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



విరాళం అందజేస్తున్న జెడ్పీటీసీ మధుకర్

మర్పల్లి: పట్లూర్‌తండాలో సంతు సేవాలల్ మందిర నిర్మాణం కోసం మర్పల్లి జెడ్పీటీసీ పబ్బే మధుకర్ రూ.51 వేలను ఆలయకమిటీ సభ్యులకు సోమవారం విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మానసిక ప్రశాంతత కోసం తమకు నచ్చిన ఆలయాలను నిర్మించుకొని, దైవచింతన అలవర్చుకుంటే ప్రశాంతత చేకూరుతుందని చెప్పారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు అశోక్, వార్డు సభ్యులు సునీల్, నర్సింహులు, డైరెక్టర్ సంగన్న, శంకర్, ప్రభు, గర్మునాయక్ ఆలయ కమిటీ సభ్యులు ఉన్నారు.

అధిష్టానం పునరాలోచించాలి

వికారాబాద్ అర్బన్: వికారాబాద్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి విషయంలో పార్టీ అధిష్టానం, ముఖ్యమంత్రి కేసీఆర్ పునరాలోచన చేయాలని ఆ పార్టీ సీనియర్ నేత, దళిత నాయకుడు భూమెల కృష్ణయ్య ఒక ప్రకటనలో కోరారు. సిట్టింగ్ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్‌పై వ్యక్తిగతంగా ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని, మరోసారి ఆయనకు అవకాశం ఇస్తే 30 నుంచి 40 వేల మెజార్టీతో ఓడిపోయే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. ఆనంద్ గెలిచిన నాటి నుంచి తన సొంత ప్రయోజనాల కోసమే పని చేశారని, ప్రజల కోసం, నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎక్కడా పని చేయలేదని విమర్శించారు. ఇప్పటికైనా అధిష్టానం నియోజకవర్గంపై దృష్టి సారించి, అభ్యర్థి విషయంలో పునరాలోచన చేయాలని కోరారు. సిట్టింగ్ ఎమ్మెల్యే ఆనంద్‌కు కాకుండా మిగతా సీనియర్ నాయకులకు ఎవరికి టికెట్ ఇచ్చినా అందరం కష్టపడి పని చేస్తామని ఆయన వెల్లడించారు.

మాసానిగూడలో గాలికుంటు టీకాలు

శంకర్‌పల్లి: గాలికుంటు టీకాలను పశువులకు తప్పనిసరిగా వేయించాలని మాసానిగూడ సర్పంచ్ రాములు పేర్కొన్నారు. సోమవారం గ్రామంలోని పశువులకు గాలికుంటు టీకాలను వేయించారు. పశువైద్యాధికారి జయసుధ మాట్లాడుతూ.. గాలికుంటు వ్యాధి సోకిన పశువుల్లో తీవ్ర నీరసం ఉంటుందని, నోట్లో పుండ్లు వంటి లక్షణాలు ఉంటాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్‌ఎఫ్‌ఏ రాజ్యలక్ష్మి, వినోద, శాంతమ్మ, సుగుణకుమారి తదితరులు పాల్గొన్నారు.

అతిథిగృహానికి మోక్షమెన్నడో!

- అర్ధంతరంగా నిలిచిన పనులు
- ఏడేళ్లుగా మొండిగోడలతో దర్శనం
- నిరుపయోగంగా ట్రెజరీ, దివ్యాంగుల మిద్దెలు
- ప్రజాధనం దుర్వినియోగం
- పట్టించుకోని పాలకులు, అధికారులు



నిర్మాణ దశలో నిలిచిపోయిన అతిథిగృహం పనులు

దోమ: సర్కారు భవనాలపై అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. కొన్ని నిర్మించిన భవనాలు వినియోగంలోకి రాక నిరుపయోగంగా ఉండగా.. మరికొన్ని సరిపడా నిధులు లేక మధ్యలోనే వదిలేయడంతో అవి మొండి గోడలతో దర్శనం ఇస్తున్నాయి. ఇలా రూ.లక్షలు వెచ్చించి ప్రభుత్వం నిర్మించిన మిద్దెలు అధికారుల జవాబులేని తనం, పాలకుల పట్టింపులేని తనానికి ప్రజాధనం వృథా అవుతుందన్న ఆరోపణలు వస్తున్నాయి.

రూ.10 లక్షలతో నిర్మాణం

దోమ మండల కేంద్రంలో ఏడు సంవత్సరాల క్రితం జిల్లా పరిషత్ నిధులు రూ.10 వెచ్చించి ఉన్నతాధికారులు బస చేసేందుకు అతిథి గృహానికి శ్రీకారం చుట్టారు. అయితే నిర్మాణదారుడు ఉన్న డబ్బులతో స్లాబ్ వేసి, కొంత మేరకు గోడలను నిర్మించారు. మిగతా పనులను బడ్జెట్ లేక ఆపేశారు. దీంతో అది పశువులు, కుక్కలకు ఆవాసంగా, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. అంతే కాకుండా ఇటీవల కురిసిన వర్షాలకు నిర్మిణ దశలో ఉన్న గోడలు, స్లాబ్ క్రమంగా శిథిలావస్థకు చేరుకుంటోంది.

ప్రజాధనం వృథా..

రూ.లక్షలు వెచ్చించి ప్రభుత్వ భవనాలు నిర్మిస్తే ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం, బడ్జెట్ లేని కారణంగా అవి మూణ్నాళ్ల ముచ్చటగా మిగిలిపోతున్నాయి. దీంతో నిర్మాణ దశతో పాటు నిరుపయోగంగా ఉన్న భవనాలు ఎప్పుడు కూలిపోతాయోనని మండల ప్రజలు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. మండల కేంద్రంలో ట్రెజరీ కోసం ఓ భవనాన్ని నిర్మించి, నిరుపయోగంగా వదిలేశారు. దివ్యాంగుల కోసం నిర్మించిన భవనం పరిస్థితి దీనంగా మారింది. ఇలా నిర్మించి వదిలేసిన భవనాలపై సంబంధిత అధికారులు దృష్టి సారించి, వాటిని వినియోగంలోకి తీసుకురావాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం

అతిథిగృహం నిర్మాణానికి సరపడా నిధులు లేక మధ్యలోనే వదిలేసిన విషయాన్ని పలుమార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు సదరు కాంట్రాక్టర్ చెబుతున్నారు. అయినప్పటికీ వారి దగ్గర నుంచి ఎలాంటి స్పందన రాలేదని వాపోయారు. దీంతో పనులను చేపట్టడంలో ఇబ్బందులు తలెత్తి, నిలిపి వేసినట్లు చెప్పారు. ఇప్పటికైనా నిధులు మంజూరు చేస్తే భవనం పూర్తిస్థాయిలో నిర్మించేలా చర్యలు తీసుకుంటామని కాంట్రాక్టర్ చెబుతున్నారు.

ప్రజాధనాన్ని కాపాడాలి

ప్రభుత్వ అధికారులు ప్రజాధనం దుర్వినియోగం కాకుండా చూడాలి. రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన భవనాలను వారి పర్యవేక్షణ లోపం కారణంగా.. అవి నిరుపయోగంగా మారాయి. మరికొన్ని భవనాలు బడ్జెట్ లేక పనులు నిలిచిపోయాయి. సంబంధిత అధికారులు చొరవ తీసుకొని, భవన నిర్మాణాలు పూర్తి చేసి, వినియోగంలోకి తీసుకు వచ్చేలా చర్యలు చేపట్టాలి.

-మేకల యాదయ్య, జిల్లా ఓబీసీమోర్చా అధ్యక్షుడు

భూ తగాదాలు వద్దు

- దాడులు చేసుకుంటే కఠిన చర్యలు
- తహసీల్దార్ పురుషోత్తం



భూతగాదాకు పాల్పడిన వ్యక్తులను తహసీల్దార్ ఎదుట హాజరుపర్చిన పోలీసులు

దోమ: రైతులు భూ తగాదాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ పురుషోత్తం హెచ్చరించారు. దోమ మండలం మోత్కూర్ గ్రామంలో భూ తగాదాలతో గొడవలకు పాల్పడిన వ్యక్తులను సోమవారం పోలీసులు బైండోవర్ చేసి తహసీల్దార్ ఎదుట ప్రవేశపెట్టారు. సర్వే నంబర్ 519లో షేక్ మక్బుల్ అనే రైతుకు భూమి ఉంది. అదే గ్రామానికి చెందిన రంగంపల్లి చెన్నయ్య, శివానంద్, వెంకటయ్య, కృష్ణయ్య భూమి తమదంటూ ఈ నెల 18న మోత్కూర్‌లో ఇరువర్గాలు గొడవలకు పాల్పడ్డారు. ఈ విషయంలో పోలీసులు వారిపై కేసు నమోదు చేసి తహసీల్దార్ ఎదుట హాజరు పరచగా.. వారికి తహసీల్దార్ రూ.లక్ష జరిమాన విధించారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడారు. భూ వివాదాలకు సంబంధించి ఎలాంటి సమస్యలు ఉన్నా తమ ద్వారా పరిష్కారమైతే రైతులు చేసుకోవాలి తప్పితే, దాడులకు పాల్పడకూడదని చెప్పారు. తమ పరిధిలో లేని వాటిపై కోర్టును ఆశ్రయించాలని సూచించారు. అంతే కాని దాడులు చేసుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

చెరువు నిండే.. చేను మురిసే

తాండూరు రూరల్: ఇటీవల కురిసిన వర్షాలకు చెరువులు, కుంటలు జలకళతో తొణికిసలాడుతున్నాయి. దీంతో సాగునీటికి కొదవ లేకుండా పోయింది. పచ్చని పంటపొలాలు కనుచూపు మేర పరుచొని కనువిందు చేస్తున్నాయి. ఏకధాటి వర్షాలతో తాండూరు మండలం ఎల్మకన్నె చెరువులోకి భారీగా వరద నీరు వచ్చి చేరింది. ఫలితంగా చెరువు ఆయకట్టు కింద పొలాలు ఉన్న రైతులు పెద్ద ఎత్తున వరిసాగు చేస్తున్నారు.



నిండుకుండలా ఎల్మకన్నె చెరువు



చెరువు కింద పచ్చని పంటపొలాలు

దరఖాస్తుల పరిశీలన విస్తృతం



మోమిన్‌పేట: అర్జీ దారుల సమాచారాన్ని సేకరిస్తున్న ఎంపీడీఓ శైలజారెడ్డి



పెద్దేముల్‌లో ఎంపీడీఓ లక్ష్మప్ప

మోమిన్‌పేట: గృహలక్ష్మి దఖాస్తులను క్షేత్ర స్థాయిలో ఆరుగురు ప్రత్యేకాధికారుల బృందం పరిశీలిస్తోంది. వారం రోజులుగా ఎంపీడీఓ శైలజారెడ్డి, ఎంపీఓ యాదగిరి, ఏపీఓ శంకర్, ఏపీఎం రాజు, ఆర్ఐ రాజు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పుష్పలతలు 28 గ్రామపంచాయతీల పరిధిలో.. మొదటి విడతలో సుమారు 1800వరకు దరఖాస్తులు రాగా.. ఇప్పటి వరకు 80శాతం పరిశీలించినట్లు సమాచారం. అర్జీ దారుల ఇంటికి వెళ్లి పూర్తి సమాచారాన్ని సేకరిస్తున్నారు.

పెద్దేముల్‌లో..

పెద్దేముల్: పెద్దేముల్ మండలం ఓంలానాయక్‌తండా గ్రామ పంచాయతీలో ఎంపీడీఓ లక్ష్మప్ప గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకున్న వారి ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరించారు. ఆర్జీ దారుల సొంత నివాస స్థలం, ప్రస్తుతం నివాసం ఉంటున్న ఇంటి వివరాలు, తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడారు. నిజమైన అర్హులకు సొంతింటి నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.3లక్షలు ఆర్థిక సహాయం అందజేస్తుందని చెప్పారు.

బొంరాస్‌పేటలో..

బొంరాస్‌పేట: గృహలక్ష్మి పథకం దరఖాస్తుల విచారణను అధికారులు గిరిజన తండాల్లో ముమ్మరం చేశారు. బొంరాస్‌పేట మండలం బొట్లోనితండాలో నిరుపేదలు, గుడిసెలు, ఖాళీ స్థలాలను పంచాయతీ కార్యదర్శి సూర్యప్రకాశ్, ఏఈఓ హేమ, సర్పంచ్ మేగ్యానాయక్ తదితరులు పరిశీలించారు. అర్జీదారుల వివరాలను సేకరించారు.

అనంతగిరి: గృహలక్ష్మి పథకంలో భాగంగా వికారాబాద్ మండల పరిధి గ్రామాల్లో సోమవారం మండల అధికారులు పర్యటించారు. అర్జీ దారుల ఇంటికి వెళ్లి వివరాలను సేకరించారు. పీరంపల్లిలో ఎంపీడీవో సత్తయ్య, ఏపీవో శ్రీను, సర్పన్‌పల్లిలో ఎంపీఓ నాగరాజు బృందం దరఖాస్తులను పరిశీలించారు.

ఎమ్మెల్యే కృషితో కొత్త పంచాయతీ

పెద్దేముల్: ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి కృషితో పెద్దేముల్ మండలం ధారుణివాగుతండా కొత్త గ్రామపంచాయతీగా అవతరించిందని తండావాసులు తెలిపారు. ఈ మేరకు సోమవారం హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే నివాసంలో గిరిజనులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. వెనుకబడిన తండాకు ప్రత్యేక నిధులు కేటాయించాలని గిరిజన నాయకులు సురేష్‌నాయక్, మోగాసింగ్, రవీందర్, భరత్, వీరన్న, గోపాల్, బాలు, లచ్యానాయక్, సాయికృష్ణ, రాములు, కుమార్ తదితరులు ఎమ్మెల్యేను కోరారు.

ముదిరాజ్‌లకు అవకాశం ఇవ్వకపోవటం సిగ్గుచేటు

పెద్దేముల్: తెలంగాణ కోసం పోరాడిన ముదిరాజ్‌లకు బీఆర్‌ఎస్ పార్టీ ఒక్క శాసనసభ సీటు కేటాయించకపోవడం సిగ్గు చేటని వికారాబాద్ జిల్లా ముదిరాజ్ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు నర్సింహులు మంగళవారం ఒక ప్రకటనలో మండిపడ్డారు. రాష్ట్రంలో ముదిరాజ్‌లు 30శాతం జనాభా ఉన్నా.. గుర్తింపులేదని ఆవేదన వ్యక్తంచేశారు. దొరవారు ముదిరాజ్‌లను తొక్కిపెట్టి ఉంచాలన్న భావనతో ఉన్నారని, రాబోయే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు తగినబుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.

ఆర్థిక సహాయం

మర్పల్లి: పంచలింగాల గ్రామానికి చెందిన బేగరి శాంతమ్మ(62) అనారోగ్యంతో ఆదివారం రాత్రి చనిపోయారు. విషయం తెలుసుకున్న ఎస్‌కేఆర్‌ట్రస్ట్ వ్యవస్థాపకుడు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఎస్.కొండల్‌రెడ్డి అంత్యక్రియల కోసం సోమవారం ఉదయం రూ.5 వేలను సర్పంచ్, ట్రస్టు సభ్యుడు సురేందర్‌రెడ్డి ద్వారా పంపగా.. ఆయన బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.

రుద్రాభిషేకం

కొడంగల్: పట్టణంలోని పురాతన గాడిబాయి శివాలయంలో సోమవారం లింగమయ్యకు రుద్రాభిషేకం చేశారు. శ్రావణ సోమవారం పురస్కరించుకొని ఆలయ అర్చకుడు కిట్టుస్వామి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాలు, పెరుగు, నెయ్యి, చందనం, తేనే, పండ్లు, నారికేళం తదితర సుగంధ ద్రవ్యాలతో అభిషేకం, అర్చన చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

ఓటు నమోదుపై అవగాహన అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ పురుషోత్తం

- బీఎల్‌ఓలు, ప్రజాప్రతినిధులతో తహసీల్దార్

దోమ: ఓటు నమోదుపై బీఎల్‌ఓలు, ప్రజాప్రతినిధులు ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని తహసీల్దార్ పురుషోత్తం అన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌ఓలు, ప్రజాప్రతినిధులకు ఓటు నమోదుపై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బీఎల్‌ఓలు గ్రామాలకు సంబంధించిన ఓటర్ జాబితాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి తప్పులు లేకుండా సవరించాలని సూచించారు. ప్రజాప్రతినిధులు బీఎల్‌ఓలకు సహకరించి ఓటరు సవరణతో పాటు, ఓటు నమోదు చేసుకోని వారిని చేయించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ విజయేందర్, ఆర్ఐ లింగం, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

వైద్యుల సూచనల మేరకే మందులు



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ వెంకటేశ్ యాదవ్ తదితరులు

బంట్వారం: ప్రజలు ఆరోగ్యం పట్ల అవగాహన కలిగి ఉండాలని బార్వాద్ సర్పంచ్ వెంకటేశ్ యాదవ్ అన్నారు. సోమవారం కోట్‌పల్లి మండలం బార్వాద్‌లో మెగా హెల్త్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పీఏసీఎస్ చైర్మన్ రాంచంద్రారెడ్డితో కలిసి వైద్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఆరోగ్య సమస్యలపై నిర్లక్ష్యం చేయకూడదని గ్రామస్తులకు సూచించారు. సొంత వైద్యం కాకుండా వైద్యుల సూచన మేరకు మందులు వాడాలని చెప్పారు. అనంతరం డాక్టర్లు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వికారాబాద్ ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రొఫెసర్ సీహెచ్. రాంచందర్, డాక్టర్లు వినోద్‌కుమార్, రాఘవేందర్, గిరీష, స్రవంతి, ప్రత్యూష, వాసంతి, గంగరాజు, కవిత, ఎస్వీఆర్ ట్రస్ట్ ఫౌండర్ నరేందర్ రెడ్డి, హెచ్‌ఎం వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

వీరజవాన్లకు అశ్రునివాళి

దోమ: జవాన్లు ప్రయాణిస్తున్న వాహనం అదుపు తప్పి లద్ధాక్ లోయలో పడి 9మంది సైనికులు ప్రాణాలుకోల్పోగా.. వారికి సోమవారం బొంపల్లి వాసులు కొవ్వొత్తులతో అశ్రునివాళులు అర్పించారు. కార్యక్రమంలో రాములు, ప్రవీణ్‌యాదవ్, రాజేష్, భాస్కర్, నర్సింహులు, లోకేష్ యాదవ్, మహేశ్, యాదయ్య, బంటు నర్సింహులు, ఆంజనేయులు, శ్రీనివాస్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



నివాళి అర్పిస్తున్న యువకులు

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి



అనంతగిరి: ఎన్టీఆర్ చౌరస్తాలో నిరసన వ్యక్తంచేస్తున్న ఏఎన్‌ఎంలు

అనంతగిరి: వైద్య శాఖలో పనిచేస్తున్న సెకండ్ ఏఎన్‌ఎంలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఏఎన్‌ఎంలు చేస్తున్న ధర్నాకు వారు మద్దతు తెలిపి మాట్లాడారు. ఏళ్ల తరబడి గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలు అందిస్తున్న వారిని రెగ్యులర్ చేయాలని కోరారు. సీఐటీయూ గౌరవ అధ్యక్షుడు మల్లేశం, యూనియన్ జిల్లా కార్యదర్శి లలితమ్మ, స్రవంతి, పాపమ్మ, రజియా బేగం, సుజాత, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

అన్యాయం చేసింది..

తాండూరు టౌన్: తమను క్రమబద్ధీకరించాలని కోరుతూ సెకండ్ ఏఎన్‌ఎంలు పట్టణంలోని బస్టాండు ఎదురుగా రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఏఎన్‌ఎంలు మాట్లాడారు. మెడికల్ అండ్ హెల్త్ విభాగంలో కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్ చేసిన ప్రభుత్వం.. తమకు అన్యాయం చేసిందని వాపోయారు. కొత్తగా ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇచ్చి మా కుటుంబాలను రోడ్డున పడేసిందని, వెంటనే ప్రభుత్వం స్పందించి కాంట్రాక్టు ఏఎన్‌ఎంలను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, ఏఎన్‌ఎంలు శ్రీదేవి, భారతి, మల్లమ్మ, మాధవి, రోజా, పుష్ప, నిర్మల తదితరులు పాల్గొన్నారు.



మంత్రి సబితారెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి ఆశీర్వాదం తీసుకున్న ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

బీఆర్‌ఎస్ విజయం పక్కా

షాద్‌నగర్: రాష్ట్ర ప్రజలందరి ఆశీర్వాదం సీఎం కేసీఆర్‌పై ఉందని.. వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ మళ్లీ విజయం సాధించడం ఖాయమని ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. సోమవారం సాయంత్రం పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ తనపై ఎంతో నమ్మకం ఉంచి 4వసారి టికెట్ కేటాయించినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సీఎం కేసీఆర్ తనపై పెట్టిన నమ్మకాని వమ్ము చేయకుండా నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి చేసేందుకు తనవంతు కృషి చేస్తానని అన్నారు. షాద్‌నగర్ ప్రగతికి సీఎం కేసీఆర్ ప్రత్యేక దృష్టి కేటాయించి కోట్లాది రూపాయల నిధులు మంజూరు చేశారని అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సీఎం కేసీఆర్ అభివృద్ధి, సంక్షేమ పథకాలను చేపడుతున్నారని అన్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాలు తెలంగాణ వైపు చూస్తున్నాయని అన్నారు. తెలంగాణ మరింత అభివృద్ధి సాధించాలంటే సీఎం కేసీఆర్ నాయకత్వం అవసరమన్నారు.

ఘనంగా నాగుల పంచమి



తాండూరు రూరల్: ఎంపీడీఓ ఆవరణలో నాగులపుట్ట వద్ద పూజలు చేస్తున్న ఎంపీపీ అనితగౌడ్



కుల్కచర్లలో..



వికారాబాద్: పుట్ట వద్ద పూజలు చేస్తున్న భక్తులు



ధారూరు: నాగదేవత విగ్రహాలకు పూజలు చేస్తున్న మహిళలు



బంట్వారం: కోట్‌పల్లిలో చిన్నారి

ధారూరు/ తాండూరు రూరల్: నాగుల పంచమి సందర్భంగా సోమవారం మహిళలు భక్తిశ్రద్ధలతో నాగదేవత విగ్రహాలకు ఘనంగా పూజలు చేశారు. పుట్టలో, విగ్రహాలపై పాలుపోసి మొక్కులు తీర్చుకున్నారు. జొన్నలతో తయారు చేసిన పేలాలు, మురమురాలను భక్తులు ఆలయాలకు తీసుకెళ్లి, పూజ అనంతరం గుడి నుంచి ఇంటి వరకు వచ్చే దారిలో ఒక్కొక్కటిగా జారవిడుస్తూ ఇంటికి చేరుకున్నారు. కాగా ధారూరు వీరభద్రేశ్వరస్వామి దేవాలయంలో నెలకొన్న నాగదేవతకు, మండల పరిషత్ కార్యాలయానికి వెళ్లే మార్గంలో ఉన్న నాగదేవత విగ్రహాలకు మహిళలు పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం భక్తులు కొందరు అన్నదానం చేశారు.